

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేశ్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షలకు మించనివారు డిసెంబరు 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, హార్డ్‌కాపీలను జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.



గంగమ్మకు ఒడిబియ్యం.. నక్షత్ర హారతి

మెదక్‌లోని ముత్తాయికోట సిద్దేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. వేకువజామునే శివుడికి అభిషేకం నిర్వహించి, ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ కొలనులో గంగమ్మకు ఒడిబియ్యం, సారె సమర్పించారు. అనంతరం నక్షత్ర హారతి నిర్వహించారు.

-మెదక్ మున్సిపాలిటీ

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతి పెద్ద నంది విగ్రహం

- ఎర్దనూర్‌లో పెద్ద రాతి నుంచి నంది విగ్రహం తీర్చిదిద్దడానికి శ్రీకారం
- నంది విగ్రహ పనుల పూజా కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్‌తో మాట్లాడి ఆలయాలు, మసీద్‌లు, చర్చిల కోసం నిధులు అందేలా చూస్తా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో పరిశీలిస్తున్న జగ్గారెడ్డి


ఎర్దనూర్‌లో నంది విగ్రహ తయారీ కోసం పూజలు నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, మహేశ్వరశర్మ

సంగారెడ్డి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం పసల్‌వాది వద్ద ఉన్న జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతి పెద్ద నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కంది మండలం ఎర్దనూర్ గుట్టల్లో నంది విగ్రహాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన అతిపెద్ద శిలను గుర్తించారు. ఈమేరకు జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సిద్ధాంతి డాక్టర్ మహేశ్వరశర్మతో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శుక్రవారం సదరు శిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శిలను పసల్‌వాదిలోని విద్యాపీఠానికి త్వరలో తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భారీ నంది విగ్రహాన్ని ఏర్పాటుచేసే స్థలాన్ని జగ్గారెడ్డి పరిశీలించారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సిద్ధాంతి మహేశ్వరశర్మ నంది విగ్రహ నమూనాను జగ్గారెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన ఆలయాలు, మసీదులు, ప్రార్థన మందిరాలు, ఇతర ధార్మిక కార్యక్రమాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ తదితరులు ఉన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


మెదక్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో రహదారి భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలుచేస్తే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. చలికాలంలో పొగమంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా హెడ్‌లైట్లు ఆన్‌లో ఉంచి సురక్షితమైన దూరం పాటించాలని సూచించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ వ్యసనాలతో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, నేర ప్రవర్తనతో భవిష్యత్తు కోల్పోవాల్సి వస్తుందన్నారు. జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎంహెచ్‌వో శ్రీరామ్, పోలీసు, రవాణా అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామ్మూర్తి తెలిపారు. నర్సాపూర్, చిప్పల్‌తుర్తి, లింగాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనుల కోసం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేస్తున్నామని తెలియజేశారు.

ఊరు.. పోరు

- మూడు విడతల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎన్నికలు
- రేపు తుది ఓటరు జాబితా సిద్ధం
- పంచాయతీ ఎన్నికలకు మొదలైన కసరత్తు
- రిజర్వేషన్లపైనే వీడని ఉత్కంఠ
- ఎన్నికల తేదీల వైపే అందరి చూపు



గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెలలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పాత ఓటరు జాబితాను అభ్యంతరాల స్వీకరణ కోసం గ్రామపంచాయతీల వద్ద ప్రదర్శించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించారు. ఈ నెల 23న తుది జాబితాను ప్రకటించనున్నారు. మరోవైపు రిజర్వేషన్లు, ఎన్నికల తేదీల వైపే అందరి చూపు నెలకొంది.

సంగారెడ్డి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు త్వరలోనే కొలువుదీరనున్నారు. ఈ దిశగా కసరత్తు నడుస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తారనే ప్రచారం జరిగినప్పటికీ మళ్లీ పంచాయతీ ఎన్నికల వైపే ఎలక్షన్ కమిషన్ మొగ్గుచూపింది. చివరిసారి 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అప్పటి పాలకవర్గాల పదవీకాలం 2024 ఫిబ్రవరి నెలతో ముగిసింది. అప్పటి నుంచి 22 నెలలుగా పంచాయతీ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి.

మూడు దశల్లో ఎన్నికలు

మెదక్ జిల్లాలో 492 గ్రామపంచాయతీలు, 4,220 వార్డులు ఉండగా తొలి విడతలో 160 గ్రామాలు, 1,402 వార్డులు, రెండో విడతలో 149 గ్రామాలు, 1,290 వార్డులు, మూడో విడతలో 183 గ్రామాలు, 1,528 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 613 గ్రామపంచాయతీలు, 5,370 వార్డులకుగాను తొలివిడతలో 136 గ్రామాలు, 1246 వార్డులు, రెండో విడతలో 243 గ్రామాలు, 2,164 వార్డులు, మూడో విడతలో 234 గ్రామపంచాయతీలు, 1,960 వార్డులకు ఎన్నికలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రమంతటా ఇదే విధానం అమలులో ఉండడంతో పోలింగ్ సిబ్బంది, బందోబస్తు చేసే పోలీసు సిబ్బంది పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విడతలవారీగా చేపడుతున్నారు.

రేపు తుది జాబితా

ఇప్పటికే పలుమార్లు ఓటరు జాబితాలను ప్రదర్శించారు. అయితే తాజా పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మరొకసారి ఓటు నమోదు చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రేపు అన్ని గ్రామపంచాయతీల్లో

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి జిల్లాలో మండలాలు

తొలివిడత	రెండో విడత	మూడో విడత
సంగారెడ్డి	అందోల్	కల్హేర్
కంది	చౌటకూర్	కంగ్టి
కొండాపూర్	పుల్కల్	మనూరు
సదాశివపేట	వట్‌పల్లి	నాగల్‌గిద్ద
పటాన్‌చెరు	రాయికోడ్	నారాయణఖేడ్
గుమ్మడిదల	జరాసంఘం	నిజాంపేట
హత్నూర	జహీరాబాద్	సిర్గాపూర్
మొగుడంపల్లి	న్యాల్‌కల్	కోహీర్, మునిపల్లి

మెదక్ జిల్లాలో మండలాలు

తొలివిడత	రెండో విడత	మూడో విడత
అల్లాదుర్గం	తూప్రాన్	నర్సాపూర్
రేగోడ్	మనోహరాబాద్	చిలప్‌చెడ్
టేక్మాల్	చేగుంట	కౌడిపల్లి
హవేలిఘన్‌పూర్	నార్సింగి	కుల్చారం
పాపన్నపేట	రామాయంపేట	శివ్వంపేట
పెద్ద శంకరంపేట	నిజాంపేట	వెల్దుర్తి
చిన్నశంకరంపేట	మాసాయిపేట	మెదక్

పైసలిస్తారా లేదా?

- అడ్డూ అదుపూ లేకుండా ట్రాన్స్‌జెండర్ల ఆగడాలు
- శుభకార్యాలకు రేట్లు ఫిక్స్ చేసి డిమాండ్
- అడిగినంత ఇవ్వకుంటే రచ్చరచ్చ

7

శుభకార్యాలకు విరామం

- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం
- గృహప్రవేశాలు, వివాహాది కార్యాలకు బ్రేక్
- వ్యాపారాలకు తప్పని గడ్డుకాలం

7


కోహీర్‌లో పొలాలను కమ్మేసిన పొగమంచు

స్వల్పంగా తగ్గిన చలి

కోహీర్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఝరాసంగం 10.6, న్యాల్‌కల్ 10.7, అల్లోల్ 10.8, కంగ్టి 1, సదాశివపేట్ 11.5, నిజాంపేట్ 11.5, మల్‌చేల్మ 11.6, రాయికోడ్ 11.8, కడ్పల్ 11.8, నల్లవల్లి 11.9, మొగుడంపల్లి 11.9, సత్వార్ 12.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి

మెదక్ జిల్లాలో శివ్వంపేట 11.6, శంకరంపేట్ 12, సర్దన 12.2, వాడి 12.2, నర్లాపూర్ 12.3, దామరంచ 12.5, నాగపూర్ 12.5, వెల్దుర్తి 12.5, మిన్పూర్ 12.7, బోడగట్ 12.7, అల్లాదుర్గం 12.9 డిగ్రీలుగా నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేట్ 11.6., కొండపాక 12.0, హబ్షిపూర్ 12.1, అంగడి కిష్టాపూర్ 12.2, నంగునూరు 12.4, మీరుదొడ్డి 12.9, దౌల్తాబాద్ 13 డిగ్రీలుగా నమోదయ్యాయి.

ఐదు రోజులు పొగ మంచు

రాబోయే ఐదు రోజులు ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేస్తుందని, చలి తీవ్రత తక్కువగా ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంది. 27, 28 తేదీల్లో పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురియవచ్చని వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న కావలి కమలమ్మఅంజయ్య దంపతులు

అక్రమ నిర్మాణాలపై కొరడా..

అయినవారికి మినహాయింపు..!

- తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఉద్రిక్తత
- బాధితుల ఆందోళన, రాస్తారోకో

రామచంద్రాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలను శుక్రవారం తెల్లవారుజామున మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఎలియన్స్ అపార్ట్‌మెంట్స్ నుంచి ఉస్మాన్‌నగర్ వరకు ఉన్న 12 అక్రమ నిర్మాణాలను కూల్చివేయగా, వారిని నిలువరించేందుకు బాధితులు ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఉప్పరపల్లి వ్యవసాయభూమిలో నిర్మించిన కట్టడాన్ని సిబ్బంది కూల్చేవేసేందుకు అధికారులు ప్రయత్నం చేయగా బాధితులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణం కోసం తామే మొదట భూమి ఇచ్చామని, తమ నిర్మాణాలను ఎలా కూలుస్తారంటూ నిలదీశారు. రాస్తారోకో చేయగా పోలీసులు వారిని చెదరగొట్టారు.

కూల్చివేతల్లో పారదర్శకత కరువు

శుక్రవారం చేపట్టిన కూల్చివేతల్లో పారదర్శకత లేదని బాధిత రైతులు ఆరోపించారు. ఒకేచోట మూడు నాలుగు అక్రమ నిర్మాణాలుంటే ఒకే నిర్మాణాన్ని కూల్చారని, ముడుపులు ముట్టిన చోటికి అధికారులు

మిగతా 8వ పేజీలో

రూ. 10 లక్షలు డిమాండ్ చేశారు: కావలి కమలమ్మ, అంజయ్య

'రేడియల్ రోడ్డులో ఎకరం భూమి పోయింది. ఉన్న భూమిలో వరి, కూరగాయలు పండించుకుంటున్నాం. రోడ్డువైపు ఉన్న భూమిలో రోడ్డుకు దూరంగా తాత్కాలిక షెడ్లు నిర్మించాం. అవి కూడా పూర్తి కాలేదు. బతుకుదెరువు కోసం షెడ్లు వేసుకోవడం నేరమా?' అంటూ గ్రామానికి చెందిన కావలి కమలమ్మ, అంజయ్య దంపతులు నిలదీశారు. డబ్బులు ఇవ్వనందుకే తమ పొలంలో నిర్మాణాలను కూల్చివేశారని వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. 'రూ.60 కోట్ల దర పలికే భూములు ఉంది కదా.. రూ. 10 పది లక్షలు ఇవ్వలేరా?' అంటూ సిబ్బందిని పంపడం ఎంతవరకు భావ్యమని ప్రశ్నించారు.

ఉత్సాహంగా ఖేలో ఇండియా అస్మిత ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత బాలికల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు మెదక్ స్టేడియంలో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పోటీలను ప్రారంభించారు. అండర్ 14, 16 విభాగాల్లో రన్స్, త్రో, జంప్స్ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


ఖేలో ఇండియా అస్మిత జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తడిసిన వడ్లు.. ఇట్టే సిద్ధం!

- ధాన్యాన్ని నిమిషాల్లో ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్ రూపకల్పన
- కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల రూపకల్పన
- దేశంలోనే తొలిసారిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి
- 4 నుంచి 8 గంటల్లో 5–10 టన్నుల ధాన్యం ఆరబెట్టొచ్చు



7

బీమాతో హోంగార్డులకు ఆరోగ్య, ఆర్థిక భద్రత

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమిస్తామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లాలోని హోంగార్డులకు ప్రమాద, ఆరోగ్యబీమాపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న ఆరోగ్య సమస్యలు పెద్దభారం కాకుండా ఆరోగ్యబీమా తీసుకొని ధీమాగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీలు కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, మద్యం, ఆన్‌లైన్‌గేమ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయా బ్యాంకుల అధికారులు మాట్లాడుతూ తమ బ్యాంకులో అకౌంట్ అకౌంట్ హోల్డర్‌కు ప్రమాదం జరిగి మరణిస్తే కుటుంబానికి రూ. 40 లక్షల బీమా లభిస్తుందన్నారు. హోంగార్డులు బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్‌లో సంవత్సరానికి రూ.11,650 హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తే కుటుంబంలోని నలుగురికి రూ. 33 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, ఆర్ఐలు డానియల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

జహీరాబాద్/కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరిగాయి. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం పత్యానాయక్ తండాలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 10 క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా ఆధార్, పట్టా, బ్యాంకు పాసు పుస్తకాలు దగ్ధమైనట్లు తండా వాసులు శుక్రవారం తెలిపారు. తండాకు చెందిన మారోని బాయి తన రేకుల షెడ్‌లో నివాసముంటుంది. ఇటీవల తమ చేనులో వేసిన పత్తిని తీసి ఇంటిలో వేసింది. గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం కాగా, వ్యవసాయ భూమి పట్టా, బ్యాంకు పాసు బుక్‌లు, ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు దగ్ధమైనట్లు బాధితురాలు మారోని బాయి తెలిపింది. భర్త లేకపోవడంతో సొంతంగా వ్యవసాయం చేసి పండించిన పత్తి అగ్నికి ఆహుతి కావడంతో మారోనిబాయి కన్నీరు మున్నీరయింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరింది.

ధనసిరిలో ఇల్లు దగ్ధం

జహీరాబాద్ నియోజక వర్గంలోని మొగడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన మల్లారెడ్డి ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటనలో నాలుగు తులాల బంగారం, 80 తులాల వెండి, వంట సామగ్రి కాలిపోయాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. ఇంట్లోనే పూర్తి వస్తువులు, దుస్తులు కాలిపోవడంతో కేవలం కట్టుబట్టలతోనే మిగిలిపోయారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు.





సిర్గాపూర్ మండలం అంతర్గాం పత్యానాయక్ తాండాలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పత్తి, మొగడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో దగ్ధమైన సామగ్రి

మద్యం తాగడానికి వచ్చి దోపిడీ

● 5 తులాల పుస్తెల తాడు, రూ.66 వేల నగదు చోరీ

మద్దూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాయపల్లిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ బెల్టుషాపు నిర్వాహకుడి ఇంటికి మద్యం తాగడానికి వచ్చి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన యేల్ల కవితవెంకటేశం కుటుంబం బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి సుమారు 9.35 గంటలకు మద్యం తాగడం కోసం గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బీరు కొనుగోలు చేసి ఇంటి ముందు కూర్చొని తాగారు. కొద్దిసేపటి తర్వాత తలుపులు తీయాలని చెప్పి ఇంట్లోకి ప్రవేశించి దంపతులను బెదిరించారు. కవిత మెడలోని 3 తులాల పుస్తెల తాడు, 2 తులాల నల్లపూసల దండతో పాటు 53 వేల నగదును దోచుకున్నారు. భయంతో అరువడంతో అక్కడ నుంచి పరారయ్యారు. యేల్ల కవితవెంకటేశం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని 9వ వార్డు పెద్దమ్మ కాలనీలోని రోడ్డు మధ్యలో డ్రైనేజీకి చెందిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. జేసీబీ వాహనం వెళ్లడం వల్ల మ్యాన్‌హోల్‌పై ఉన్న కవర్ పగిలిపోయిందని, దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని రోజులుగా మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో అది కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని, రాత్రి పూట కూడా ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వెంటనే మ్యాన్‌హోల్‌పై కవర్ వేయాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పుల్కల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై ఆ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. పంచభూతాలలో ఒకటైన అగ్నిని మనం అనేక విధాలుగా వినియోగిస్తామని జోగిపేట ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అగ్నితో ఆటలు ఆడితే మనకు మనమే ప్రమాదాలను కొని తెచ్చుకున్నవాళ్లమవుతామన్నారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రాథమికంగా తీసుకోవాల్సిన చర్యలు ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు.



శివంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములపై విచారణ జరపాలి

పటాన్‌చెరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములపై విచారణ జరపాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 120, 121, 125 సర్వే నెంబరులోని 240 ఎకరాల భూమిని ట్రక్ టెర్మినల్ పేరుతో సేకరించిందని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పుడు ఇతరులు సేకరించిన భూములను తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరపాలని కోరారు.



కమిషనర్ మధుసూదనరెడ్డికి వినతి పత్రం అందించిన సీపీఎం శ్రేణులు

అబుదాబిలో మడద వాసి మృతి

● బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం అక్కడికి..

● స్వగ్రామానికి మృతదేహం తెప్పించాలని మంత్రులకు వినతి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన జేరిపోతుల వెంకటస్వామి(48) యూఏఈలోని అబుదాబీలో గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వెంకటస్వామి బతుకుదెరువు కోసం రెండునెలల క్రితం అబుదాబికి వెళ్లాడు. ఐదు రోజుల క్రితం అబుదాబీలో ఉదయం పనికివెళ్తున్న సమయంలో వెంకటస్వామి గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంకటస్వామి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. యూఏఈలోని భారత్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐలకు సమాచారం పంపామని వెంకటస్వామి మృతదేహాన్ని తన స్వగ్రామానికి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులకు చెప్పి బరోసాకల్పించినట్లు తెలిపారు.



వెంకటస్వామి(ఫైల్)

యువకుడి ఆత్మహత్య

జిన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం అయ్యమ్మ చెరువు హనుమాన్ దేవాలయం సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం హనుమాన్ దేవాలయ సమీపంలోని ఓ చెట్టుకు యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. స్థానికులు గుర్తించారు. మృతుడు నవీన్ (25) కాగా, సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన వాడు. నవీన్ భార్య, ఇతర కుటుంబ సభ్యులతో స్థానికంగా ఉపాధి కోసం వచ్చి నివసిస్తున్నాడు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

ఒంటరితనం భరించలేక వృద్ధురాలు..

దుబ్బాక/ మిరుదొడ్డి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం భర్త మరణించడంతో, అప్పటినుంచి దిగులుతో ఉంటున్న ఓ వృద్ధురాలు ఒంటరితనం భరించలేక జీవితం మీద విరక్తి చెంది, కూడవెల్లి వాగులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. అక్బర్‌పేట - భూంపల్లి మండలం భూంపల్లి ఎస్సై వి.హరీశ్ కథనం మేరకు.. దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన సామల మణెమ్మ (70) అనే వృద్ధురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, వారందరికీ వివాహాలు జరిపించింది. ఆమె భర్త బాలనర్సయ్య ఏడాది క్రితం మృతి చెందగా, గ్రామంలో ఉన్న ఇద్దరు కొడుకుల వద్ద తలా కొన్ని రోజులు ఉంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో సోమవారం దుబ్బాకలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో ఉన్న ఆమె చెల్లెలు గుండ్ల కళావతి ఇంటికి వెళతానని చెప్పడంతో, కుమారుడు నాగరాజు ఆమెను దుబ్బాక బస్టాండ్లో దిగబెట్టి వెళ్లిపోయాడు. రాత్రి కుమారుడు చిన్నమ్మకు ఫోన్ చేసి తల్లి గురించి అడగగా, తమ ఇంటికి రాలేదని చెప్పడంతో ఆందోళన చెందారు. రెండు రోజులు ఆమె కోసం గాలించి, గురువారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి కూడవెల్లి వాగులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శుక్రవారం శవపంచనామా చేసీ, కేసు నమోదు చేశారు.

గృహిణి అదృశ్యం

రామచంద్రాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కేసీఆర్ నగర్(డబుల్ బెడ్‌రూం-2)లో చోటు చేసుకుంది. సీఐ గణేష్ పటేల్ తెలిపిన వివరాల ప్రకారం... కేసీఆర్ కాలనీలో నివాసముంటున్న షేక్ సంమాద్(27) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య షేక్‌సభా ఫాతిమా(25) ఇంటి వద్దనే ఉంటుంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఈ నెల 19న భర్తతో గొడవపడిన ఫాతిమా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ఫాతిమా(ఫైల్)

సర్దార్ పటేల్ స్ఫూర్తితో విశ్వగురువుగా దేశం

- ఉక్కు మనిషి, దేశభక్తి గల ప్రధాని మోదీతో సాధ్యం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఐక్యతా ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి ఉక్కు మనిషి, ధృడమైన దేశభక్తిగల వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ రూపంలో దేశానికి లభించడం అదృష్టమన్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'గా ఉన్న మన దేశాన్ని 2047 నాటికి విశ్వ గురువుగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ కల అని, అందుకు యావత్ దేశ ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, మై భారత్ ఆధ్వర్యంలో శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఐక్యతా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణంలోని అంగడి బజార్‌లో విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సర్దార్ పటేల్ కృషితోనే స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ సంస్థానంతో సహా 565 సంస్థానాలు భారత దేశంలో విలీనమయ్యాయని గుర్తుచేశారు. ర్యాలీలో మై భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్, పుర కమిషనర్ రమేశ్‌కుమార్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంఈవో ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీ ఆలయ హుండీ ఆదాయం రూ.33 లక్షలు

ఝరాసంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన సంగారెడ్డి జిల్లాలోని శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 85 రోజులకుగానూ రూ.33 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

తడిసిన వడ్లు.. ఇక ఇట్టే సిద్ధం!

ధాన్యాన్ని నిమిషాల్లో ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్ రూపకల్పన

నూర్పిడి అయ్యాక అకాల వర్షాలు పడ్డప్పుడు తడిసిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులకు గోస తప్పడం లేదు. రోడ్ల మీదనో, కొనుగోలు కేంద్రాల్లోనో ఓ వారం పాటు ఆరబెడితే గానీ అమ్ముకోలేరు. తేమతో కూడిన ధాన్యాన్ని అమ్ముకోవడమూ సవాలుగా మారుతోంది. మరి.. ఎలాంటి కష్టనష్టాలు లేకుండా తడిసిన, తేమతో కూడిన ధాన్యాన్ని, ఇట్టే ఆరబెట్టుకునే యంత్రం అందుబాటులోకి వస్తే? సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు అన్నదాతల కోసం నిమిషాల వ్యవధిలో ధాన్యాన్ని ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్‌ను రూపొందించారు.


ఆటోమేటెడ్ డ్రయ్యర్‌తో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందం

- కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ
- దేశంలోనే తొలిసారిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి
- 4 నుంచి 8 గంటల్లో 5–10 టన్నుల ధాన్యం ఆరబెట్టొచ్చు
- రైతులకు అతి తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నాలు

కంది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఈ అద్భుత ఆవిష్కరణకు నాంది పలికారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.స్వామి సూచనలు, సలహాలతో ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం అధిపతి డాక్టర్ పద్మతో కలిసి వ్యవసాయ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మహమ్మద్ ముదాసీర్, సాయి ప్రియ, నవ్య దాదాపు నాలుగు నెలల పాటు పరిశోధనలు జరిపి ఈ యంత్రానికి తుదిరూపునిచ్చారు. ఈ యంత్రానికి త్వరలోనే పేటెంట్ హక్కులు తీసుకొని మార్కెట్లోకి అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. పూర్తి స్వదేశీ సాంకేతికతతో దేశంలో తొలిసారి తయారైన ఆటోమేటెడ్ డ్రయ్యర్ ఇదే. దీన్ని అన్నదాతలకు అతి తక్కువ ధరకు అందించడానికి కృషి చేస్తున్నట్లు వారు చెప్పారు.

ఎలా పనిచేస్తుంది?

ఈ ఆటోమేటెడ్ డ్రయ్యర్‌పైన హైపర్ గొట్టం అనే పరికరం ఉంటుంది. దాని ద్వారా ధాన్యాన్ని నింపుతారు. అందులోంచి వడ్లు నెమ్మదిగా రోటర్‌స్క్రూ ద్వారా కన్వేయర్‌లోకి వెళతాయి. మిషన్‌కు అమర్చిన ప్రత్యేకమైన సెన్సార్ వేడి గాలిని కన్వేయర్‌లోకి పంపుతుంది. దీంతో వడ్లు తడిసినప్పుడు 50 నుంచి 60 శాతం ఉన్న తేమ నిమిషాల్లోనే 12 శాతం లోపు వస్తుంది. ఇలా ఆరబెట్టిన వడ్లను మేలు రకం విత్తనాలకు, హై క్వాలిటీ బియ్యం తయారీకి ఉపయోగించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సమర్థంగా.. వేగంగా

వడ్లను ఎండలో ఆరబెట్టే సంప్రదాయ పద్ధతి కన్నా ఈ విధానం ద్వారా సమర్థంగా, వేగంగా ఆరబెట్చొచ్చునని.. పైగా నాణ్యతను కాపాడుతూ తేమ శాతం తగ్గించడం దీని ప్రత్యేకత అని చెప్పారు. నియంత్రిత ఉష్ణోగ్రత ద్వారా ధాన్యం పగిలిపోకుండా, రంగు మారకుండా, చెడు వాసన రాకుండా డ్రయ్యర్లు చూస్తాయని పేర్కొన్నారు. ఈ యంత్రం ద్వారా 4-8 గంటల్లోనే 5-10 టన్నుల మేర ధాన్యాన్ని ఆరబెట్టొచ్చు. ఈ యంత్రం ద్వారా నిర్వహణ ఖర్చులు, సమయాన్ని ఆదా చేయొచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రభుత్వ అనుమతితో ఈ ఆటోమేటెడ్ డ్రయ్యర్‌కు అతి త్వరలో పేటెంట్ హక్కులు కల్పించి రైతులకు అనుకూలమైన పరిమాణంలో తయారుచేసి మార్కెట్లో ప్రవేశపెడతాం.

రైతుల ఇబ్బందులను చూసి..



ఇటీవల రోడ్లపై ఎక్కడ చూసినా ఆరబెట్టిన ధాన్యమే కనిపిస్తోంది. రోడ్లపై వడ్లు అరబెట్టే ప్రయత్నంలో రైతుల ప్రమాదానికి గురవడం చూసి.. వారికి ఏదైనా ప్రత్యామ్నాయ మార్గం సూచించాలని నిర్ణయించుకున్నాం. వెంటనే మా వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చించి ఆటోమేటెడ్ డ్రయ్యర్‌ను రూపొందించాం. రైతులకు అండగా ఉండడానికి మరిన్ని పరిశోధనలు జరపుతాం.

-మహమ్మద్ ముదసీర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థి

రంగు మారదు.. నాణ్యతా తగ్గదు



కళాశాలలో మేము అభివృద్ధి చేసిన ఈ డ్రయ్యర్‌లో వడ్లను రబెడితే ఆ ధాన్యం రంగు మారదు. చెడు వాసన రాదు. నాణ్యత కూడా ఏమాత్రం తగ్గదు. ఇందుకోసం ప్రత్యేకంగా సెన్సార్లను తయారుచేసి అమర్చాం. ఇవి వడ్లను ఏమాత్రం దెబ్బతినకుండా ఆటోమేటిక్‌గా ఆరబెట్టడానికి ఎంత ఉష్ణోగ్రత కావాలో అంతే తీసుకొని వడ్లను ఆరబెడతాయి.

- సాయి ప్రియ, ఫైనల్ ఇయర్ విద్యార్థి

రైతుల కష్టాన్ని చూసి చలించిపోయాం



రైతన్నలు 4-5 నెలలు రెక్కలు ముక్కలు చేసుకుంటే కోత దశకొచ్చేసరికి ధాన్యం తడిసోతోంది. రైతుల ఈ కష్టాలను చూసి మేం చలించిపోయాం. వారికి అండగా నిలిచేందుకు వినూత్న ఆలోచనలు చేశాం. తొలుత వడ్లు ఆరబెట్టే సమస్యకు చెక్ పెట్టాలని పరిశోధనలు ముమ్మరంగా జరిపాము. మా ప్రొఫెసర్ల సూచనలు సలహాలతో ఆటోమేటెడ్ డ్రయ్యర్ యంత్రాన్ని అభివృద్ధి చేశాం.

- నవ్య, ఫైనల్ ఇయర్ విద్యార్థి

రాష్ట్రస్థాయికి ఐదు వైజ్ఞానిక నమూనాలు

- జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రశంసలు




ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థుల ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్ నమూనా, బేగంపేట విద్యార్థిని కార్తీకకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రామచంద్రాపురం విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

రామచంద్రాపురం టౌన్/జోగిపేట/చేర్యాల/ మద్దూరు/రాయపోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనల్లో ఆకట్టుకున్న, ప్రతిభ చూపిన ఐదు నమూనాలు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. జోగిపేట, రామచంద్రాపురం, చేర్యాల, ధూళిమిట్ట, రాయపోల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అర్హత సాధించాయి.

ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్..

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం, ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు కె.సాయిచరణ్, పి.ప్రవీణ్‌లు బొగ్గు, విద్యుత్ వ్యయం లేకుండా పనిచేసే పోర్టబుల్ ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్ నమూనాను రూపొందించారు. సోలార్ ప్లేట్, బ్యాటరీ ఉపయోగించి తయారుచేసిన ఈ పరికరం, ఇస్త్రీ చేసేవారికి, పర్యావరణానికి మేలు చేస్తుంది. గైడ్ టీచర్ రవీందర్ పర్యవేక్షణలో తయారైన ఈ నమూనా రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది.

ప్రమాదాల నివారణకు...

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట జడ్పీఎస్ఎస్ విద్యార్థిని ఎం.శ్రావణి రూపొందించిన వేగంగా ప్రయాణించే వాహనాల నుంచి వీచే గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి, ప్రమాదాల నివారణ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టును గైడ్ టీచర్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రూపొందించింది. ఇదే పాఠశాలకు చెందిన కె.సంజన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించింది.

స్మార్ట్ స్కూల్ బ్యాగ్

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.కార్తిక రూపొందించిన స్మార్ట్ స్కూల్ బ్యాగ్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమెకు గైడ్ టీచర్ భాస్కర్‌రెడ్డి సహకరించారు.

స్మార్ట్ టీ-లెట్‌కు ప్రథమ బహుమతి

సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని శ్రీసాయి క్రిష్ణవేణి హైస్కూల్ విద్యార్థిని శ్రీష చవాన్ రూపొందించిన స్మార్ట్ టీ-లెట్ (టాయిలెట్ పరికరం) రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. కదలలేని రోగులు, వృద్ధుల కోసం రూపొందించిన ఈ పరికరం, సాధారణ కుర్చీని స్మార్ట్ టాయిలెట్‌గా మారుస్తుంది. టాయిలెట్ వ్యర్థం నేరుగా సెప్టిక్ ట్యాంక్‌కు చేరుతుంది. అనంతరం నాజిల్ ద్వారా నీరు చిమ్మి శుభ్రం చేయడమేగాక, అక్కడే ఉన్న డ్రయ్యర్ తడిని ఆరబెడుతుంది. గైడ్ టీచర్ సురేశ్ సహకారంతో రూపొందించిన ఈ ప్రాజెక్ట్ నారాయణఖేడ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.

ఎమర్జెంగ్ టెక్నాలజీ

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఠాగూర్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గణేష్ రూపొందించిన ఎమర్జెంగ్ టెక్నాలజీ ఆకట్టుకున్నది. ఈ నమూనా రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు జోగిపేట విద్యార్థిని శ్రీషను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి రామచంద్రాపురం విద్యార్థి గణేష్‌ను కూడా బృందంతో సహా అభినందించారు. బేగంపేట విద్యార్థిని కార్తీక, టీచర్ కేటగిరీలో అర్హత సాధించిన ఉపాధ్యాయుడు ధారా ప్రభాకర్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఆర్టీసీ సిబ్బంది ఓపికతో విధులను నిర్వహించాలి : డీఎస్పీ

- ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సిబ్బంది ఓపికతో విధులను నిర్వహించాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలు అందజేసిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందిని గుర్తించి వారికి అవార్డులు అందజేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మెనేజర్ టి.స్వామి, ఆర్టీసీ అసిస్టెంట్ మెనేజర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ సిబ్బంది డీఎస్పీ సైదానాయక్

షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన షూటింగ్ రేంజ్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. వీరికి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్‌విపాటిల్, డీవైఎస్‌వో పరంధామరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

పైసలిస్తారా లేదా?

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లు... ఆగడాలకు అడ్డూ అదుపూ లేదు
- వివాహాలు, శుభకార్యాల్లో రేట్లు ఫిక్స్ చేసి డిమాండ్
- అడిగినంత ఇవ్వకుంటే రచ్చరచ్చ


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరేశ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొందరు ట్రాన్స్‌జెండర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. జిల్లావ్యాప్తంగా శుభకార్యాలు, వివాహాలు జరుగుతున్న ప్రాంతాల్లో వీరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శుభకార్యాన్ని బట్టి రేట్

సంగారెడ్డి, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం, జిన్నారం, గుమ్మడిదల వంటి పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ శుభకార్యం జరిగినా, ఇంటి ముందు టెంట్ వేసినా వెంటనే పది మంది ట్రాన్స్‌జెండర్లు గ్రూప్‌గా వచ్చి వాలిపోతున్నారు. ఇంటి యజమాని ఆర్థిక స్థితిని బట్టి, జరిగే శుభకార్యం (పెళ్లి, గృహప్రవేశం వంటివి) స్థాయిని బట్టి వీరు ఒక రేట్‌ను ఫిక్స్ చేసి డిమాండ్ చేస్తున్నారు. పెళ్లి, గృహ ప్రవేశం వంటి పెద్ద కార్యక్రమాలకు కనీసం రూ.30 వేల వరకు చెల్లించాలని బలవంతం చేస్తున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే వారు వెకిలి చేష్టలు ప్రదర్శిస్తూ, ఆ ప్రాంతంలో రచ్చరచ్చ సృష్టిస్తున్నారు. శుభకార్యానికి వచ్చిన బంధువులు, స్నేహితుల ముందు గిల్టీగా ఫీలవుతున్న ఇంటి యజమానులు చేసేది లేక, పరువు పోతుందనే భయంతో వారు అడిగినంత డబ్బు ఇవ్వక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా, జిల్లాలోని ప్రధాన కూడళ్లలో కూడా వాహనాలను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసుల కౌన్సెలింగ్, ఎస్పీ హెచ్చరిక

బలవంతపు వసూళ్ల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుమారు 60 మంది ట్రాన్స్‌జెండర్లను గురువారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ నరేశ్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ విషయంపై స్పందిస్తూ.. జిల్లాలో ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుభకార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లకు వెళ్లి నేరపూరిత చర్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. ఎక్కడైనా హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడి ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

శుభకార్యాలకు విరామం

- దాదాపు మూడు నెలల పాటు ముహూర్తాలు లేవు
- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం
- గృహ ప్రవేశాలు, వివాహాది కార్యాలకు పూర్తిగా బ్రేక్
- వ్యాపారాలకు తప్పని గడ్డుకాలం



జోగిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు నెలలపాటు శుభముహూర్తాలకు విరామం రానున్నది. ఈనెల మార్గశిర శుద్ధ సప్తమి 28వ తేదీన ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యం(మూఢం) మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభ కార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

ఏమిటీ మూఢం ?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుని కిరణాలలో కనుమరుగైపోవడాన్ని మూఢం అంటారు. గ్రహ శక్తులు బలహీనవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభ కార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో, శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభ కార్యాలు జరిపించడం శుభ సూచకం కాదని సూచిస్తున్నారు.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా, పుష్య మాసం శూన్య మాసమవుతోంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహా మాఘీగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర దుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రఫీ, టెంట్ యజమానులు, పూల దుకాణదారులు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు వంటి సంబంధిత రంగాల వ్యాపారాలు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పురోహితంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

ఒక్క ముహూర్తమూ ఉండదు



ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడునెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తమూ ఉండదు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, ఆఖరికి ఎంగేజ్‌మెంట్లు లాంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైదిక, పురోహితంపైనే ఆధారపడ్డ పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డుకాలమే.

- శిలాంకోట ప్రవీణాచార్యులు, వైదీక, స్మార్త పురోహితుడు

మేం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది



ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లు పెరిగి, టెంట్‌షాపు యజమానులకు చాలా వరకు గిరాకీ తగ్గింది. ఏటా ఈ సీజన్‌లో వందల వివాహాలు జరిగేవి. చేతినిండా పని దొరికేది. కానీ ఈసారి ముహూర్తాలు లేకపోవడంతో మాదగ్గర పని చేసేవాళ్లకు వేతనాలు ఇవ్వడం కూడా కష్టం కానుంది. మాతో పాటు ఈ వ్యవస్థపై ఆధారపడ్డ ఇతర వృత్తుల వారికి పనులు ఉండవు. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

- మోదిని వెంకటేశం, టెంట్‌హౌజ్ యజమాని

ఆయుష్మాన్‌కు మోక్షమెప్పుడో!

● నత్త నడక పల్లె దవాఖానాల భవన నిర్మాణాలు
● కొన్ని గ్రామాల్లో పనులు పూర్తయినా ప్రారంభించని వైనం
● సకాలంలో వైద్య సేవలు అందక గ్రామీణ ప్రజల అవస్థలు


కెల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన పల్లె దవాఖాన భవనం

కోహీర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను సకాలంలో అందించాలనే లక్ష్యంతో జాతీయ ఆరోగ్య సంస్థ కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన)లను నిర్మిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ లోపం, వైద్యశాఖ ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యంతో సకాలంలో పనులు పూర్తి కావడం లేదు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలఘట్టు, కవెల్లి, నాగిరెడ్డిపల్లి, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానాల భవనాలను నిర్మాణానికి కేంద్ర రూ.80 లక్షలు మంజూరు చేసింది. కవెల్లి, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ వాటిని ప్రారంభించడం లేదు. ఇక చింతలఘట్టు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో భవనాల నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. అదేవిధంగా బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మనియార్‌పల్లి, ఖానాపూర్, పైడిగుమ్మల్ ఒక్కొక్క పల్లె దవాఖాన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు కాగా, కోహీర్ మున్సిపల్ పట్టణంలో మరో మూడు పల్లె దవాఖానలకు ప్రభుత్వం మరో రూ.60 లక్షలు మంజూరు చేసింది. పైడిగుమ్మల్, కోహీర్ గ్రామాల్లో ఒకటి చొప్పున పల్లె దవాఖాన భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. మనియార్‌పల్లి, ఖానాపూర్, కోహీర్‌లో మరో రెండు పల్లె దవాఖాన భవనాలు ఇంకా నిర్మాణం చేపట్టనేలేదు. దీంతో గ్రామీణ రోగులు సకాలంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంజినీర్ విభాగం ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో పల్లె దవాఖాన భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కోహీర్‌లో పునాది దశలో ఉన్న పల్లె దవాఖాన భవనం

న్యూస్ బాక్స్

బీటీ రోడ్డు కోసం రూ.1.60 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలంలోని రెండు గిరిజన తండాలకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.1.60 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో మండలంలోని గోడగుట్ట తండా నుంచి జడ్పీ రోడ్డు వరకు, అలుగు తండా నుంచి ఇబ్రహీంబాద్ జడ్పీ రోడ్డు బీటీ నిర్మించనున్నట్లు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

పెద్దశంకరంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని పెద్దశంకరంపేట మండల వ్యవసాయ అధికారి నాగం క్రిష్ణ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని కె. వెంకటాపూర్ గ్రామ శివారులోని శివకుమార్, సంతోష్ కుమార్‌ల పంటల సాగు భూమిని పామ్‌ను ఫీల్డ్ ఆఫీసర్ జాన్సన్‌తో కలిసి పరిశీలించారు. మండలంలో 50 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారని, త్వరలోనే వారికి మొక్కలు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అఖిల్, వినీత్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నిజాంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్సై రాజేష్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సై రాజేష్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా నిర్దేశించిన వేగ పరిమితులకు లోబడి వాహనాలను నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

● కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ నేతలు

పటాన్‌చెరు రూరల్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రాజా వారి బంగ్లా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాసభ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మల్లు రవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు, నీలం మధు మాట్లాడుతూ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు పెబ్బేటి మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు పగిడాల శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ భయ్యా వెంకటస్వామి, నాయకులు సుంకరబోయిన మహేష్, వాకిటి ఆంజనేయులు, చెన్న రాములు, కృష్ణయ్య, కేతురి వెంకటేష్, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమిస్తే చర్యలు

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-మెదక్ 765డి జాతీయ రహదారిపై నర్సాపూర్ పట్టణంలో పలువురు వ్యాపారులు ఫుట్‌పాత్, పార్కింగ్ స్థలంలో వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడతుఉన్నారు. ఇక దుకాణాల ఎదుట ఫుట్‌పాత్‌పై వ్యాపారం నిర్వహిస్తున్న చిరువ్యాపారుల నుంచి దుకాణాదారులు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. వీటన్నింటిపై ఫిర్యాదులు రావడంతో డీఎస్పీ నరేందర్‌గౌడ్ చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక పోలీస్ అధకారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక పోలీసు అధికారులు శుక్రవారం ఫుట్‌పాత్‌పై ఉన్న వ్యాపారులతో పాటు పార్కింగ్ చేసే చోట పెట్టిన పళ్ల దుకాణాల వారికి కూడా ముందస్తుగా హెచ్చరించారు. ఇతరులకు ఇబ్బందులు లేకుండా, నిబంధనలు అతిక్రమించకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని సూచించి, మరోసారి ఇటువంటివి జరిగితే తగిన చర్యలు తప్పవని ఎస్ఐ రంజితకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి, అడ్డుగా ఉన్న వాటిని తొలగించాలని సూచించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి


విద్యుత్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్‌ను సరఫరాకు చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్యను నిర్మూలించాలన్నారు. అలాగే ఖేడ్ పట్టణంలోని సిరూర్ భూమయ్య కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. డీఈ శ్రీనివాస్, ఏడీఈ నాగిరెడ్డి, ఏఈలు నారాయణ, మోతిరాం, శోభ, శృతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంతాజ్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, కేతకి సంగమేశ్వర ఆలయ డైరెక్టర్ ఈశ్వరప్ప, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహేర్, అశోక్‌పటేల్, హన్మండ్లు, మాజీద్, నాగభూషణంరెడ్డి, జ్ఞానేశ్వర్, నగేష్ ఉన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను ప్రారంభం

ఖేడ్‌లో ఇంపాక్ట్, లయన్స్‌క్లబ్ ద్వారా ఏర్పాటు చేసిన మెగా వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను అదనపు కలెక్టర్ ఉమా హారతితో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వర్ రావు మాట్లాడతూ నారాయణఖేడ్‌లో ఇలాంటి శిక్షణ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. లైన్స్‌క్లబ్ ప్రతినిధులు తదితరులున్నారు.

అక్రమ ఇసుక తరలింపును నిలిపివేయాలి

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ నియోజకవర్గ పరిధిలో అక్రమ ఇసుక తరలింపును తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగు నుంచి నెల రోజులుగా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఈ అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోందని చెప్పారు. పోలీసులు సైతం చూసి చూడనట్లు వదిలేస్తున్నారన్నారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జునగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలి : మెదక్ డీఈవో


తూప్రాన్‌లో ప్రసంగిస్తున్న డీఈవో

తూప్రాన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివి ఉన్నతులు కావాలని జిల్లా విద్యాధికారి విజయ పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. బాలుర హైస్కూల్‌లో ఎస్ఎస్‌సీ విద్యార్థుల ప్రత్యేక తరగతులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. 10వ తరగతి పరీక్షలు దగ్గరకు వచ్చాయని, మీకు అవసరాలు ఉంటే సమకూరుస్తానని హామీ ఇచ్చారు. పరీక్షలకు అందరూ హాజరు కావాలని, పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నతులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ పరీక్షలకు హాజరై విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని డీఈవో విజయ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డాక్టర్ పర్వతి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శుక్రవారమే డీఈవో బాధ్యతలు స్వీకరించి తూప్రాన్ విచ్చేసిన డీఈవో విజయను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలో నిర్మించిన అభయాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మాజీ కౌన్సిలర్ ప్రభురెడ్డి నేతృత్వంలో గణపతి పూజ, రుద్రహోమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రుద్రహోమం అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్, గాయిత్రి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

వెల్దుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎలుకపల్లి గ్రామ శివారులో నిర్మించిన ఆలయంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త పొన్నం పెంటమ్మ పోతాగౌడ్, కుటుంబ సభ్యుల, గ్రామస్థులు నడుమ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మ వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్మికుడి కుటుంబానికి రూ.21 లక్షల పరిహారం

పటాన్‌చెరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): షెడ్డు పైకప్పు నుంచి కింద పడి మరణించిన కార్మికుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని రాణి పరిశ్రమలో శుక్రవారం కార్మికులను విధుల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. అనంతరం స్పందించిన యాజమాన్య ప్రతినిధులు నాయకులతో చర్చలు జరిపారు. రూ.21 లక్షలు పరిహారం, అంత్యక్రియలకు రూ.లక్ష అందించడానికి ఒప్పుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి


యశ్వంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

టేక్మాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా మండలంలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న వివాదం కారణంగా చైర్మన్ పదవి తమదంటే తమదంటూ రెండు వర్గాలు రెండు చైర్మన్లను ఎన్నుకున్నాయి. తప్పుడు నివేదికలను సమర్పించి తమను దోషిగా పరిగణిస్తున్నారంటూ హైకోర్టులో యశ్వంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను స్వీకరించి, చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి కొనసాగుతారని తీర్పునిచ్చింది. ఈ మేరకు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సహకార సంఘాన్ని రాజకీయ రంగుతో ముక్కలు చేయకుండా అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సిద్దయ్య, సలీం, భాస్కర్, గోవిందాచారి, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా..

(5వ పేజీ తరువాయి)

వెళ్లలేదని బాధితులు ఆరోపించారు. ముడుపులు తీసుకోవడంలో ఆరితేరిన సిబ్బంది ఈ చిట్టాను తయారుచేసి ఉండవచ్చని ఆరోపణలు చేశారు.

సమాధానం చెప్పాలి

రైతులకు నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారని అధికారులను నిలదీసేందుకు మాజీ ప్రజాప్రతినిధులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోగా, ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేశారు. ఒంటి గంట వరకు వేచి చూసిన అనంతరం మధ్యాహ్నం ఆర్వో ప్రభాకర్ రావడంతో ఎందుకు కూల్చారో చెప్పాలంటూ లేఖను ఇచ్చారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నవారిలో మాజీ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్లు జ్యోతిశ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, కంజర్ల శ్రీశైలంయాదవ్, చిట్టి ఉమేశ్వర్, నాయకులు పి.శ్యాంరావు, జి.శ్రీనివాస్, కావలి రాములు, విష్ణు ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్లకు చీరల పంపిణీ

రామచంద్రాపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుపేద రోగులకు సేవాభావంతో వైద్యం అందించాలని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి కోరారు. శుక్రవారం రామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న మురుగు సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కల్పన, భాస్కర్‌రెడ్డి, రాణియాదవ్, వెంకటరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

క్రీడలకు ప్రాధాన్యం

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పటాన్‌చెరు మండలం భానూరు గ్రామంలో ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 14, అండర్ 17 విభాగాల్లోని కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ విజయకృష్ణ, దశరథరెడ్డి, వెంకటరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మాసాయిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని, ధాన్యాన్ని ఆరబోసి తేవాలని కోరారు. రైతులు అధికారులతో సహకరించి కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు రైతుల ఖాతాలలో జమ అవుతాయని తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

మునిపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద చెల్మెడ పీఏసీఎస్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పెద్దచెల్మెడ పీఏసీఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య, ఏవో అనితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో మొక్క జొన్నలను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సరోజిని దేవి, పీఏసీఎస్ సొసైటీ బ్యాంకు కార్యదర్శి శివకుమార్ రెడ్డి, డైరెక్టర్లు సంజీవరెడ్డి, విశ్వనాథం, సంగన్న పాల్గొన్నారు.

ఈసారి ఎమ్మెల్యే అయి తీరుతా..!

● బీఆర్ఎస్ మెదక్ ఇన్‌చార్జి కంటారెడ్డి



రామాయంపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రెండు మార్లు టికెట్ రాక ఎమ్మెల్యే పదవి కోల్పోయాను. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా ఎమ్మెల్యే అయి తీరుతాను. ఎన్ని అడ్డంకులొచ్చినా నన్ను ఎవరూ ఆపలేరంటూ బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన రామాయంపేట మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, దేనికైనా సంకల్ప బలం ఉండాలన్నారు. ఆ లక్ష్యంగానే తాను ఇక వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని.. ఎమ్మెల్యే టికెట్ కోసం అన్ని శక్తులు ఒడ్డుతానని స్పష్టం చేశారు.

చెకుముకి పోటీలు విజ్ఞానాన్ని పెంచుతాయి

హవేళిఘణపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైన్స్ విజ్ఞానాన్ని పెంచేందుకు చెకుముకి పోటీలు దోహదపడతాయని మండల విద్యాధికారి మధుమోహన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు తొలగేందుకు చెకుముకి పోటీలు ఉపయోగపడతాయి. వీటి వల్ల విద్యార్థుల్లో మేధా శక్తి పెరుగుతుంది. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, ఉపాధ్యాయులు రాజేశం, మల్లారెడ్డి, రాజశేఖర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఎస్పీలు

నాగల్‌గిద్ద/చేగుంట నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్‌ను నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, చేగుంట పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. వారి నాగల్‌గిద్ద వెంట ఎస్ఐ రామక్రిష్ణ, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, ఎస్ఐ చైతన్య కుమార్ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

● నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. ఈ మేరకు ప్రముఖ హెచ్ఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 70 కంపెనీలలో వారి అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పించే విధంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలే కాకుండా అవసరమైన వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఈ నెలాఖరులోనే ప్రారంభమవుతుందని తెలిపారు. త్వరలో రిజిస్ట్రేషన్ పేజీ, టోల్‌ఫ్రీ నెంబరు వివరాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

కోహీర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మున్సిపల్ పట్టణం నుంచి మండలంలోని పైడిగుమ్మల్ గ్రామం వరకు పాడైన రోడ్డుకు పైడిగుమ్మల్ గ్రామ మాజీ ఎంపీటీసీ రత్నయ్య తన సొంత నిధులతో మరమ్మతు పనులు చేయించారు. రెండు రోజుల క్రితం పాడైన రోడ్డును బాగు చేయాలని ఆటో డ్రైవర్లు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రోడ్డు పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ, టెండర్ ఖరారు కావడంలో ఆలస్యం కావడంతో రోడ్డు పనులు జరగక, రోడ్డు మరింత గుంతల మయంగా మారి అధ్వానంగా తయారై ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకు స్పందించిన మాజీ ఎంపీటీసీ రత్నయ్య తన సొంత నిధులతో గుంతల మయమైన రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో పైడిగుమ్మల్ మాజీ ఉప సర్పంచ్ మల్లన్న పాటిల్, నాయకులు దావీదు, సుమన, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊరు.. పోరు

(5వ పేజీ తరువాయి)

తుది ఓటరు జాబితాలను ప్రదర్శించనున్నారు. కాగా చనిపోయినవారి పేర్లు ఇప్పటికీ కూడా తొలగించలేదు. కొందరి ఇంటి చిరునామాలు, ఇంటి పేర్లలోనూ పొరపాట్లు జరిగినట్లుగా తెలుస్తున్నది. ఇదే ఫైనల్ జాబితాగా అధికారులు పరిగణిస్తున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 7,83,379 మంది ఓటర్లు, మెదక్ జిల్లా వ్యాప్తంగా 5,24,451 మంది ఓటర్లు ఉండగా తుదిజాబితాలో పెరిగే అవకాశం ఉంది.

రిజర్వేషన్లు.. తేదీలపైనే ఉత్కంఠ

శరవేగంగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వైపు అడుగులు పడడంతో ఆశావహులు సిద్ధమవుతున్నారు. 2019లో నిర్వహించిన ఎన్నికల ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఉంటాయనే సంకేతాలు రావడంతో ఆ దిశగా ఆలోచిస్తున్నారు. మరోవైపు పాత రిజర్వేషన్ల ప్రకారమే కోటా ఉంటుందని.. కాకపోతే ఆయా గ్రామాల రిజర్వేషన్లు మారతాయనే చర్చ జరుగుతోంది. అందుకే రిజర్వేషన్ల వైపు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఎన్నికల తేదీలు కూడా ఖరారు కాకపోవడంతో డిసెంబరులోనా.. లేక జనవరిలో ఎన్నికలు ఉంటాయా అని తర్జనభర్జన పడుతున్నారు. గత పరిణామాల నేపథ్యంలో ఇంతకు ఎన్నికలు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలను సైతం పలువురు వ్యక్తపరుస్తున్నారు.